రామాచంద్రమౌళి

శాసించే అనుభవాలు



సింహాద్రికి చటుక్కున తెలివి పుట్టింది. కళ్ళు తెరిచాడు.

యింకా తెల్లవారలేదు.

పల్లెలో కోళ్ళు కూస్తున్నాయి.

అలాగే కుక్కిమంచంలో పడుకుని, రెండు చేతులనూ తలక్రింద ముడుచుకుని ఒట్టి పసివానిలా ఆకాశంలోకి చూస్తూ ఉండిపోయాడు.

అతని మనసు బాగా లాగిన రబ్బరులా ఉంది.

మళ్ళీ ఆలోచనలు వానచినుకుల్లా కురియడం మొదలైంది అతని మెదడులో

'తనేంజేయాలి...తనేం జేయాలి-'

రాత్రినుండి యీ ప్రశ్న మొసలిలా పట్టి పీడిస్తోందతన్ని.

ఎంత పిండినా యిసుకలోనుండి రాని నూనెలా అతనికి జవాబు దొరకలేదు.

"తనేదీ చేయలేడా ... చూస్తూ ఊరోడ్కి-వలసిందేనా?"

"ఊరోడ్కి-వలసిందే - అంతకన్నా నువ్వేం జేయగలవు చెప్పు."

"................."

మనసు పగిలిన బొమ్మలా ఐపోయింది.

చటుక్కున లేచి కూర్చుని తలగడ క్రింది పొగాకు చుట్టను నోట్లో పెట్టుకుని వెలిగించుకున్నాడు. వెలిగించుకుని చేతిలో ఎర్రగా మండుతున్న అగ్గిపుల్లవంక ఓ క్షణం తదేకంగా పిచ్చిగా చూచి విసిరేశాడు చెయ్యి కాలగానే.

వెంటనే తుపుక్కున ఉమ్మేసి...లేచి గుడిసె ముందర వాకిట్లో అటు యిటూ నడుస్తున్నాడు అటు యిటూ తన్నుతున్న బంతిలా.

గుడిసె లోపల ఖాళీ——

తన గుండె లోపల ఖాళీ——

తన బ్రతుకంతా ఖాళీ——

...ఏం జీవితం తనది...ఛూ.

తనూ, ఎంకీ కలసి నలభై ఏండ్ల జీవితాన్ని ఓ క్షణంలా గడిపి...తమకు పిల్లలు లేకున్నా ఎంకి పొందులో ఆ ధ్యాసే లేకుండా బ్రతికి ... మొన్న మొన్న ఎంకి కన్నుమూయగానే ప్రాణం పోయిన పక్షిలా ఐపోయాడు తను.

తనిప్పుడు ఒంటరి...ఒంటరి.

ఒంటరితనం యిప్పుడు తప్పనిసరిగా గుప్పిట్లో పట్టుకోవాల్సిన నిప్పులా ఉంది.

—ప్చ్...

గుడిసె చూరు వాసాల కొనలకు వ్రేలాడగట్టిన పంజరాల దిక్కు చూశాడు, సింహాద్రి.

అన్నింటి నిండా పక్షులే-

కొన్ని చిలకలు, కొన్ని గోరింకలు, కొన్ని పావురాలు, కొన్ని పిట్టలు-

పక్కనే నేలమీద బోర్లించిన వెదురు బుట్టలవంక చూశాడు. ఒకదాంట్లో రెండు కొంగలున్నాయి. యింకోదాంట్లో రెండు మూడు కుందేళ్ళు.

తను యిన్నాళ్ళూ యిదే వృత్తి మీద బ్రతుకుతూ-ఎన్ని పక్షులను పట్టాడో, ఎన్ని జంతువులను చిక్కించుకున్నాడో-

తన నందరూ " పచ్చులోడు " అంటారు.

కాని యిప్పుడిక పక్షులను పట్టాలని గానీ, వాటి నమ్ముకుని బ్రతకాలనిగానీ లేదు... బ్రతుకంతా శూన్యంగా, ఒట్టి గడ్డిని నములుతున్నట్లుగా ఉంది.

సింహాద్రి చూరుకు వ్రేలాడుతున్న ఓ పంజరాన్ని తీసుకుని మంచంపై కూలబడ్డాడు-తలెత్తి ఎదురుగా కనబడు తున్న మర్రిచెట్టు దిక్కు చూశాడు. చెట్టు నల్లగా ... ఒంటరిగా నిలబడ్డ రాక్షసిలా అనిపించింది.

యింకో నాలుగు గంటల్లో

పెద్దమనుషులు ఆ చెట్టుక్రింద కూర్చుని రాజి సంగతీ, రాజయ్య సంగతీ తేల్చి పారేసి—

"అన్యాయం...అన్యాయం."

సన్నగా మూల్గాడు సింహాద్రి బాధగా.

ఊరివంక చూశాడు. మసక మసగ్గా ముసుగుతన్ని పడుకున్న ఎలుగుబంటులా అనిపించిందతనికి. మంచానికి ఆనకుని ఉన్న తన బరిసెను చూసుకున్నాడు తన త్రిశూలంవైపు అప్యాయంగా చూచుకుంటున్న శివునిలా

అతనిలోకి ఏదో విద్యుత్తు ప్రవహించింది

నిట్టూర్చి ... చేతిలోని పంజరం కిటికీ తెరిచాడు.

లోపలినుండి ఓ చిలక బుర్రున బయటికి పరుగెత్తి ఆకాశంలోకి ఎగిరి పోయింది తర్వాత యింకో చిలక... ఆ తర్వాత యింకొకటి-

ఖాళీ పంజరం మిగిలింది.

పంజరం పక్షిని కోల్పోయి వికారంగా...తనలా మిగిలి...

పక్షి ఉంటే పంజరానికి అందం... కాని పక్షికి...పక్షి బందీ అయి ఏడుస్తూ-

తప్పదు..బలమున్న చేతిలో బలహీన మైన జీవి చిక్కినప్పుడు యీ ఆత్మార్పణ తప్పదు.

యింకో పంజరం తెచ్చి తెరిచాడు.

పావురాలన్నీ ఎగిరిపోయాయి ఒక దాని వెనుక యింకొకటి

యింకో పంజరం-

గోరింకలు ఎగిరిపోతున్నాయి.

చిట్టచివర ఎగిరిపోతున్న పక్షి వంక అలాగే చూస్తూ ఉండిపోయాడు సింహాద్రి. పక్షి ఆకాశంలో పరుగెత్తి పరుగెత్తి ... దూరంగా ... కనుచూపు మేరను దాటి మబ్బుల్లో కలిసిపోయి- పక్షి పారిపోయి ... చూపులు ఓడిపోయాయి

సింహాద్రి చేతిలో పూర్తిగా కాలిన చుట్టను కాలిక్రింద రాసి లేచి నిలబడ్డాడు విషాన్ని మింగి నిటారుగా నిలబడ్డ శివునిలా.

ఎదురుగా తూర్పుదిక్కు మేఘాలు తగులబడ్డట్టు ఎర్రగా మండిపోతూ పొద్దు పొడుస్తోంది.

సరిగ్గా అప్పుడే ఊళ్ళోనుండి దుమ్ము రేపుకుంటూ ఓ జీపు పరుగెత్తుకొచ్చింది స్రరున. వచ్చి సింహాద్రి గుడిసె ముందర ఆగి ... జీపులోనుండి ఓ కాకీబట్టల మనిషి దిగి-

ఆ కాకీబట్టల మనిషి చొక్కా జేబుపై "హోటల్ అప్సర" అని ఉంది, ఎర్రని దారంతో కుట్టి

"ఏం సిమ్మాద్రీ. తీసుకురావచ్చుల్నా. పొద్దెక్కుతోంది...పోవాలె "

"... ... ..."సింహాద్రి మాట్లాడలేదు

"ఏమాయె"

"............" ఖాళీ పంజరాల దిక్కు చూపించాడు.

వచ్చిన హోటల్‌బాయ్ చటుక్కున షాక్‌తిని "ఏమైందివ్వాళ.." అన్నాడు

"............" సింహాద్రి ఎటో చూస్తున్నాడు పరధ్యానంగా.

బాయ్ గబగబా వెళ్ళి బుట్టలక్రింది కౌంగలనూ, కుందేళ్ళనూ తీసుకుపోయి జీపులో పడేసి వచ్చి "యివ్వాళ సేల్‌తో నున్నది చావు. ఎట్లనో ఏమొ. గిరాకి నెట్ల సంభాళించాలెనో" అని గొణుక్కుంటూ నోట్లను లెక్కబెట్టి సింహాద్రి జేబులో కుక్కి "మరి రేపన్నా యిట్ల జెయ్యకు...ఊ" అని అరస్తూ ఉరికి జీపులో కూర్చున్నాడు.

జీపు దుమ్ము రేపుకుంటూ వెళ్ళిపోయింది ఊళ్ళోకి.

సింహాద్రి శిలలా ఆటుదిక్కు చూస్తూ ఉండిపోయాడు. అతని తలలో ఆలోచనలు సముద్రంలా అరుస్తున్నాయి.

* * *

సాయంత్రం మూడు దాటింది.

మర్రిచెట్టు క్రింద-రచ్చబండమీద గుమికూడిన జనంలో కోలాహలం ఎక్కువైంది. ఒకేసారి నలుగురైదుగురు మాట్లాడుతున్నారు. ఒకరిమాట ఒకరికి అర్థంగావడంలేదు. అంతా గందరగోళంగా ఉంది.

మర్రిచెట్టుకు దూరంగా వేపచెట్టు పంగ నడుమ కూర్చున్నాడు సింహాద్రి ఒంటరిగా. కూర్చుని రచ్చబండ దగ్గర జరుగుతున్న పంచాయితీని గమనిస్తూ చేతిలోని బరిసెతో కొమ్మను గుచ్చుతున్నాడు కసిగా...ఆవేశంతో. అతనికి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నట్టు మంటగా ఉంది.

రచ్చబండ దగ్గర-

రెండు దిక్కులా యిరు పక్షాలకు సంబంధించిన పెద్దమనుషులు కూర్చుని ఉన్నారు. ఒక వర్గం దిక్కు రాజయ్య, రాజయ్య తల్లి, రాజయ్య తండ్రి ముద్దాయిలు యింకో దిక్కు రాజి, రాజి తండ్రి, నడుమ జనం, సాక్షులు... గారడి ఆట చుట్టూ జనంలా.

"అయ్యా ఒంటరిగాన్ని. మొన్న మొన్ననే తాడిచెట్టు మీదకెల్లి పడి సచ్చేటోన్ని బతికిన. ఒంట్లె బొక్కలన్ని యిరిగి ముక్కలైనై. రెక్కల్లేనోన్నైపోయిన. సావలేక బతుకుతాన. గిసోంటి నా దగ్గరినుండి వీళ్ళకేం కట్నకానుకలస్తయని నా బిడ్డకు రంకు అంటగట్టి దాన్ని అపకీర్తి పాల్జేసి యిడిపించుకోవాలని సూత్తాండ్లు దీని పీడబోతె తన కొడుక్కు నాల్గుపైసలు పట్కచ్చే యింకో పిల్లను సూచి సెయ్యచ్చనుకుంటాండ్లు ఆయనె తల్లిదండ్రులు. తల్లి గీచిన గీత దాటని ఆ పిల్లగాడు నోరు మెదుపుతలేదు ... అయ్యా...నా బిడ్డ



బతుకు కాపాడుండ్లి. అది ఏ తప్పు జేయలేదు. మీ కాల్మొక్త. నాయం చూడుండ్లి యీ గులాపోని పోరిని కాపాడుండ్లి-" రాజి తండ్రి ఏడుస్తు న్నాడు గోడుగోడున-పసివానిలా.

"ఏమే నువ్వూరోక్కి వో-ఏడుపు" కసిరాడు ఓ పెద్దమనిషి

"నువ్విట్రార రాజిగా-" యింకో పెద్దమనిషి.

రాజయ్య వచ్చాడు తలవంచుకుని

"నీ పెండ్లాం రంకు చేసిందంటా-" పెద్దమనిషి బీడీ అంటించుకుంటున్నాడు.

"... ... ..." రాజయ్య మాట్లాడలేదు. తలెత్తి యిక తను విడిచి పెట్టబోయే భార్య రాజి వంక దీనంగా చూచి మరుక్షణం తల్లివంక భయంగా చూశాడు.

"అనుదేందండి మురిదట కనబడు తాంటెనో" గడగడా అంది రాజయ్య తల్లి

"నువ్వూకోవమ్మ ... వాన్ని మాట్లాడనీ"

"చెప్పురా చెప్పు. గట్లుంటవేంది. బెల్లంకొట్టిన రాయిలా" అందామె మళ్ళీ కొడుకుతో.

"ఔ ... నా పెండ్లాం లచ్చిగాని దగ్గర పన్నది."

"ఎట్ల ఋజువు చేస్తవ్ ?"

"లచ్చిగాన్నడుగుండ్లి దాన్నడుగుండ్లి"

"ఊం..."

"..........." రాజయ్య తల్లి వంక చూశాడు పాఠం అప్పజెప్పి పంతులువంక చూస్తున్న పసివానిలా.

"గంతే...అడుగుండ్లి లచ్చిగాన్ని" అంది రాజయ్య తల్లి ఆవేశంగా.

"ఏంరా లచ్చిగా యిట్రా."

లచ్చిగాడు సర్పంచ్ పాలేరు. వచ్చాడు బిస్కట్ చూసిన కుక్కలా.

"నీకూ రాజికీ సంబంధమున్నాదిరా?"

లచ్చిగాడు తలవంచుకుని సిగ్గుపడు తున్నాడు.

"చెప్పురా..."

"..........." నవ్వుతున్నాడు ప్రపంచాన్ని జయించిన వీరునిలా

"ఏం జెప్తదండీ మొగోడు అంత కంటే." రాజయ్య తల్లి.

"నువ్ పో. రాజీ నువ్విటు రావే-"

రాజి వచ్చింది మంటల్లోకి నడుస్తున్న సీతలా.

"ఊఁ- చెప్పు నీ సంగతి."

"నేనే పాపం జెయ్యలేదు. పుట్టిచ్చిండ్లు యివన్ని."

"ఊఁ...లచ్చిగాడు నీకుతెలువదా?"

"ఎరికే మా యింటి ఎదురుగానే ఉంటడాయె. కాని వానితో నేనే పాప మెరుగ—"

"ఊఁ ... యింకేమన్నా సెప్పు కుంటావా!"

"నా సంసారం కాపాడండ్లి..."

"దొంగముండ. ఎట్ల పల్కుతోందో సూడు పతివతోల్లె. గా మొకం జూడు ఎట్లున్నదో. ఏర్పడ్త లేదా" రాజయ్య తల్లి విజృంభిస్తోంది తుఫానులా.

పెద్దమనుషులు ప్రశ్నలు మానేసి తమలో తామే మాట్లాడుకుంటున్నారు.

జనం తమలో తామే గొణుక్కుంటున్నారు ఏదో.

యింకో ఐదు నిముషాల తర్వాత పెద్దమనుషులందరూ లేచి మర్రిచెట్టుకు దూరంగా నడిచి గుసగుస పెట్టుకుంటూ-

"యిప్పుడు రాజిగాని తల్లి యిచ్చిన పైకమెంతరా?"

"మూడు వందలు."

"మనిషి కెన్నిస్తానయ్?"

"యాభై."

"మరింకేంది యిప్పుడు కాయితం రాసిపారెయ్యక."

"పో"

"పో"

యీ మాటలు మర్రిచెట్టు ప్రాంతాలకు వినబడలేదు.

పెద్దమనుషులు మళ్ళీ వచ్చారు మర్రిచెట్టు క్రిందికి రాబందుల గుంపులా. వచ్చి సర్పంచ్ స్వయంగా "లచ్చిగానికి రాజికి సంబంధ మున్నదని స్పష్టంగా తేలిపోయింది గాబట్టి యిక యిడుపు కాయితం (విడాకుల పత్రం) రాయ డానికి పెద్దమనుషులు నిర్ణయించిండ్లు... రాఘవులూ రాసెయ్‌రా కాయితం..." అన్నాడు రాతిగొంతుతో.

రాజి భోరున ఏడుస్తూ వచ్చి సర్పంచ్ కాళ్ళమీద బడ్డది, శిలైన దేవుని పాదాలపై బడ్డట్టు

ఆమె ఏడుపు ఎవరూ వినలేదు. విన్నవాళ్ళు ఏమీ చేయలేరు.

ఓ పదినిముషాల్లో విడాకుల కాగితం సిద్ధమైంది.

రాజయ్యతో బొటనవ్రేలి ముద్ర వేయించారు. రాజి వేలికి ఎవరో సిరా రాస్తూంటే ఎండిపోతున్న సిరాపై ఓ కన్నీటి బొట్టును రాల్చి తడిచేసి ముద్ర వేసింది...కాదు వేయించారు.

రాజయ్య రాజివంక అప్పుడే మనిషిని చంపిన హంతకునిలా భయంగా, దీనంగా చూసి తల్లివెంట వెళ్ళిపోయాడు యజమాని వెంట కుక్కలా.

ఆ తర్వాత జనం వెళ్ళిపోయారు. పెద్దమనుషులు వెళ్ళిపోయారు.

యిక మర్రిచెట్టు క్రింద మిగిలింది రాజి-రాజితండ్రి...నిశ్శబ్దం...కన్నీళ్ళు.

ఓ పదినిముషాల తర్వాత వేపచెట్టు మీదనుండి దిగి మర్రిచెట్టు మధ్యకు వచ్చాడు సింహాద్రి చేతిలో బరిసెతో. వచ్చి ఏడుస్తున్న తల్లివంక లోకం తెలియని పసివాడు అమాయకంగా చూచినట్టు రాజి ఉక్కు చూచి మౌనంగా ఊళ్ళోకి నడిచాడు.

రాజయ్య సింహాద్రికి బాగా పరిచయమే. రాజయ్య కుటుంబంతో

కూడా స్నేహం ఉందతనికి. ఐతే రాజయ్య తల్లి ఆడపులని సింహాద్రి క్కూడా తెలుసు

సింహాద్రి వెళ్ళేసరికి రాజయ్య వాకిట్లో నులకమంచంపై కూర్చున్నాడు ఒక్కడే. యింకెవరూ లేరు చుట్టు ప్రక్కల.

సింహాద్రిని చూసి "దా—అన్నా" అన్నాడు రాజయ్య.

"వచ్చాడ చెంకగని ... తాళ్ళలకు పోదాం రా. సుక్కేసొక్కవాలె. తోడెవ్వరులేరు."

రాజయ్యకు మహా సంతోషమైంది. తాను మందేసుకోవాలంటే అమ్మ దబ్బివ్వాలి. తాను తాగాలి...యిప్పుడు తేరగా సింహాద్రి సుక్కేయిస్తుంటే.., ఎగిరి గంతేసి సింహాద్రి వెంట నడిచాడు.

యిద్దరూ తోటలోకి నడిచింతర్వాత-సుక్కేసి...,

అప్పటికే మసకచీకటి ముసురు కుంటోంది. పక్షులు గూళ్ళకు చేరుకుంటున్నాయి.

సింహాద్రి ఓ చెట్టు ముందరాగి రాజయ్యను పిలిచి "అటు చూడు" అన్నాడు.

కొమ్మమీద రెండు పిచ్చుకలు నిలబడి ఉన్నై కునికిపాట్లు పడుతూ..

రాజయ్య చూస్తూండగానే ఆ రెండు పిచ్చుకలనూ పట్టుకున్నాడు సింహాద్రి ఓ పావుగంటలో.

రెండింటిలో ఒకటి మగ యింకొకటి ఆడది.

రాజయ్య ఎదుటనే ఆడపిచ్చుకన ఉంచుకుని మగదాన్ని మళ్ళీ విడిచి పెట్టాడు. అది బుర్రున లేచిపోయింది.

చేతిలో పిట్టతో నడుస్తున్నారు యిద్దరూ. వాళ్ళపైన గాలిలో ఎగురుతూ అరుస్తూ వెంట వస్తోంది మగపిచ్చుక.

"యివ్వాళ రాత్రి నా దగ్గరనే ఉందరా రాజిగా ఓ కుందేలున్నది, దాన్ని వండుకుందాం. నీకూ మనసు బాగలేద గద. రేపు పోదువుకే."

యింటిదగ్గర రాక్షసిలాంటి తల్లి. అన్యాయంగా రాజిని పోగొట్టుకున్న జ్ఞాపకాలు...జ్ఞాపకాలు...

రాజయ్య మనస్సు కూలిపోయిన చెట్టులా ఉంది. "సరే" అన్నాడు. ఓ రెండుగంటల తర్వాత యిద్దరూ భోం చేసి బయటమంచంపై కూర్చున్నారు.

సింహాద్రి ఏమీ మాట్లాడంలేదు. చేతిలో ఆడపిచ్చుకను పట్టుకూర్చు న్నాడు. మగపిచ్చుక యింకా అక్కడే ఉన్న సంగతి అప్పుడుగాని గమనించ లేదు రాజయ్య అది గుడిసె ఎదురుగా ఉన్న జామచెట్టుమీద నిర్విరామంగా అరుస్తోంది

యిద్దరూ చెరో మంచంలో పడుకున్నారు.

యిటు ఆడపిచ్చుక అరుపు—

అటు మగపిచ్చుక అరుపు—



రాత్రంతా అరుపులు...అరుపులు... అరుపులు.

రాజయ్యకు ప్రపంచమంతా అరుపులై...ఎటు చూచినా అరుపులై వినిపిస్తూ 'పిచ్చుకలే వేరై యింతగా గుండెలు పగిలేట్టు ఏడుస్తూంటే...తన రాజి'...రాజి...రాజి...రాజి

మసక మసక చీకట్లో ... యింకా పొద్దు పొడవక ముందే తనతో చెప్పకుండా వెళ్ళిపోతున్న రాజయ్యను చూచి నిట్టూర్చాడు సింహాద్రి తృప్తిగా.

తూర్పు ఎరుపెక్కి సూర్యుడు నెత్తురుముద్దలా ఉరికొస్తూండగా ...

"సింహాద్రన్నా" అన్న పిలుపు వినబడ్డది.

గుడిసెలోనుండి బయటికొచ్చాడు సింహాద్రి.

ఎదురుగా రాజయ్య ... రాజి ... జంటగా...నవ్వుతూ—

"నాకు బుద్ధొచ్చిందన్నా" అన్నాడు రాజయ్య సిగ్గుతో.

ఎదురుగా జామచెట్టుమీద మగ పిచ్చుక ఉరుసూనే ఉంది యింకా.

సింహాద్రి గబగబా గుడిసెలో కెళ్ళి పంజరాన్ని పట్టుకొచ్చాడు.

ఆడపిచ్చుక అరచి అరచి సొమ్మసిల్లుతోంది.

పంజరం తలుపు తెరిచాడు.

పిచ్చుక తుర్రున ఎగిరిపోయి ... జామచెట్టుమీద వాలి ... అక్కడినుండి రెండూ ఎగిరిపోతున్నాయి నీలాకాశంలో స్వేచ్ఛగా ... హుషారుగా.

సింహాద్రి ఊపిరి పీల్చుకున్నాడు తృప్తిగా ఖాళీ పంజరాన్ని చూచి.

———